గాయత్రీ మహాయజ్ఞానికి చురుగ్గా ఏర్పాట్లు


ఉల్లంపర్రులో నిర్వహించే గాయత్రీ మహాయజ్ఞం కోసం సిద్ధం చేసిన హోమ గుండాలు


యజ్ఞంలో వినియోగించే రావి, దేవదారు, మోదిక సమిదలను సిద్ధం చేస్తున్న సేవకులు

- 5న ఉల్లంపర్రు ఏఎస్ఆర్ నగర్ లో నిర్వహణ
- 864 మంది దంపతులతో 108 అగ్నిహోత్రాలు ఏర్పాటు
- 324 కిలోల దేశవాళీ ఆవు నెయ్యి వినియోగం

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు సెంట్రల్: వాయు మండలాన్ని శుద్ధి చేయాలనే లక్ష్యంతో పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో అద్దేపల్లి సూర్యరామచంద్రరావు రైస్ మిల్లు ఆవరణలో నిర్వహిస్తున్న మహా సంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం వరకూ నిర్వహించే గాయత్రి మహాయజ్ఞంలో 864 మంది దంపతులచే 108 అగ్ని హోత్రాలు ఏర్పాటు చేసి యజ్ఞం నిర్వహిస్తున్నారు. సకారాత్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్య సేవక్ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న) ఆధ్వర్యంలో పాలకొల్లు, పరిసర గ్రామాల ప్రముఖుల దాతృత్వం, పర్యవేక్షణలో మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే యజ్ఞం నిర్వహించే ప్రాంతంలో 108 అగ్ని హోత్రాలు ఏర్పాటు చేశారు. అలాగే హోమంలో వినియోగించే ద్రవ్యాలను సిద్ధం చేశారు. చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులకు అన్న సమారాధన ఏర్పాట్లు చేస్తున్నారు.

గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభం ఇలా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత రక్షణ విభాగం ఎస్పీ కొండా నరసింహరావు-అలివేలు మంగాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6.30గంటలకు శంఖారావం యుగళంతో యజ్ఞం ప్రారంభమవుతుంది. యామ వీరేష్-విజయ దంపతులు ఆస్ట్రేలియా నుంచి రప్పించిన రూ.5 లక్షల విలువైన 108 దక్షిణావృత శంఖాలు విరాళంగా అందజేశారు. ఉదయం 6.40 గంటలకు గోపూజ, 8గంటలకు కలశ పూజ, 8.30 గంటలకు గురుపూజ, 9.30 గంటలకు అఖండ శంఖారావం, 9.40 గంటలకు గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభమవుతుంది. 12.30 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 2 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం, 3గంటలకు అఖండ శంఖారావం, 3.10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వేద అధ్యయన సంస్థ చైర్మన్ డా ఆకెళ్ల విభీషణ శర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం, అనతరం 4.30 గంటలకు గురుపూజ, సత్కారాలతో కార్యక్రమం ముగుస్తుంది. కొత్తగూడేనికి చెందిన బ్రహ్మశ్రీ కటకం హరి ప్రవీణ్ శర్మ ఘనాపాఠి తోపాటు 10 మంది రుత్వికులు, అలాగే శివదేవునిచిక్కాలకు చెందిన బ్రహ్మశ్రీ ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి)తో పాటు 30 మంది అర్చక స్వాముల బ్రహ్మత్వంలో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నారు.

హోమగుండంలో వినియోగించే సుగంధ ద్రవ్యాలు...

అగ్నిహోమంలో రావి, దేవదారు, మోదిగ సమిదలుగా వినియోగిస్తున్నారు. అలాగే 324 కిలోల స్వదేశీ ఆవునెయ్యి, 108 రకాల ఔషధ గుణాలతో కూడిన హవన సామాగ్రి, కొబ్బరి కుడకలు, ముద్ద హారతి కర్పూరం, సాంబ్రాణి, గుగ్గిలం, ఎండు ఖర్జూరం, కిస్మిస్, జీడిపప్పు, దాల్చిన చెక్క, జాజికాయ, జాపత్రి, బెల్లం, అటుకులు, మరమరాలు, బియ్యం హోమ గుండంలో వినియోగించనున్నారు.

కొన్ని వేల టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి



324 కిలోల స్వదేశీ ఆవునెయ్యిని మండించడం వల్ల కొన్ని వేల టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి అయి సర్వ మానవాళికి ఆరోగ్యకరమైన వాతావరణం సమకూరుతుంది. ప్రతీ ఏటా ఖమ్మం సమీపంలోని నాచారంలో నిర్వహిస్తుంటాం. అలాగే ఏనుకూరు (తమిళనాడు), భద్రాద్రి, రుద్రపూర్, పాల్వంచ ప్రాంతాల్లో గాయత్రీ మహాయజ్ఞం గతంలో నిర్వహించాం.

– సత్య సేవక్ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న), గాయత్రీ మహాయజ్ఞం నిర్వాహకులు

క్లుప్తంగా

మొగల్తూరులో ఫ్యామిలీ ఫిజిషియన్

మొగల్తూరు: స్థానిక 3వ సచివాలయ పరిధిలో గురువారంఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారిని కాకుండా లేవలేని స్థితిలో ఉన్న రోగులను పరిక్షించి మందులు పంపిణీ చేశారు. కేవలం ఆరోగ్య కేంద్రానికే సుమారు 86 మంది రోగులు పరిక్షలు చేయించుకున్నారని డాక్టర్ దినేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది దివ్యశ్రీ, ఎస్‌జే సత్యవతి, సావిత్రి, వి.సునీత, కె.సాంబశివరావు, ప్రసన్న దేవి, విజయలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

పందులు, పశువులను రోడ్లపైకి వదలొద్దు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యజమానులు పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీససుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని చెప్పారు.

ఏకాంబేశ్వరునికి అన్నాభిషేకం


పెనుగొండలో అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండలోని కంచికామాక్షీ ఆలయంలో ఏకాంబేశ్వరునికి గురువారం అన్నాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు కేవీ సూర్యనారాయణ అర్చకత్వంలో పూజలు, అష్టోత్తర పూజలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల సహకారంతో కనుల పండువగా అన్నాభిషేకం నిర్వహించారు. అన్నాభిషేకం ప్రసాదంతో భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాండురంగ స్వామి గోశాల వార్షికోత్సవం


గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం: వశిష్ఠ గోదావరి గట్టున్న ఉన్న పాండురంగస్వామి గోశాల 9వవార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాత పూజ, లక్ష్మీగణపతిహోమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నర్సింహగిరి యోగాశ్రమం గురూజీ యోగానంద స్వామీజీ, మల్లిఖార్జున యోగాశ్రమం(గుంటూరు) దయానంద కృష్ణ స్వామీజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్యదైవం గోమాత అన్నారు. గోపూజలు ఎక్కువగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోట అరుణ, కొవనాతి రుష్యేంద్రరావు, దేశెట్టి సత్యనారాయణ, బావిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


దేగల శేషారావు (ఫైల్)

యలమంచిలి: మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు దేగల శేషారావు (104) గురువారం వయోభారంతో మరణించారు. శేషారావు వృత్తి రీత్యా రైతు. వరి, చెరకు పంటలు సాగు చేసేవారు. ఆయన భార్య మూడేళ్ల క్రితమే మరణించారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

పాలకొల్లు అర్బన్: విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలని దిగమర్రుకి చెందిన గ్రామపెద్ద కుంచె బాబ్జి కోరారు. దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.9 వేలు విలువైన పోర్టబుల్ మైక్ సెట్‌ను బాబ్జి విరాళంగా గురువారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం షేక్ పీర్ సాహెబ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్ వీరాస్వామి, గొల్లమండల రాజు, వి.రాజేశ్వరి పాల్గొన్నారు.

పుష్పరాజ్‌కు సత్కారం

సాక్షి, భీమవరం: మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్‌కు అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు, మకర సంక్రాంతి జాతీయ అవార్డు రావడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమవరంలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పుష్పరాజ్‌ను సత్కరించారు. ప్రజలకు సేవలందిస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. నేతల జ్ఞాన ప్రకాష్, సంధి జయరాజు, కోలాటి ప్రసాదరావు, పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

మొగల్తూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని టెక్నికల్ అసిస్టెంట్ జె.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, కోత్తపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం, కాళీపట్నం, రామన్నపాలెం గ్రామాల్లో పంటబోదె తవ్వకం పనులు చేపట్టగా, స్థానిక కుక్కలవారితోట నుండి ఉచ్చింతకాలువ వరకు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే పనులు చేపట్టామని ఆయన తెలిపారు.

అగ్నిప్రమాదంలో తోట దగ్ధం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం పంచాయతీ మురాలవారిపేటలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మామిడి, కొబ్బరి తోటలో మంటలు చెలరేగాయి. స్థానికులు తోట యజమాని మామిడిశెట్టి యేషయ్యకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇప్పుడిప్పుడే కాపుకు వస్తున్న మామడి తోట దగ్ధమైందని తోట యజామాని వాపోయాడు. సిగరెట్ కాల్చి పడేయడం వంటి చర్యల వల్ల తోట పాక్షికంగా అగ్నికి ఆహుతై ఉంటుందని ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో రూ.40 వేలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

శ్రీ శివదేవస్వామి హుండీ ఆదాయం లెక్కింపు


శివదేవునిచిక్కాలలోని శ్రీ శివదేవస్వామి హుండీ లెక్కిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 11 నెలలకు గాను రూ.2,33,438లు ఆదాయం లభించింది. కార్యక్రమంలో వీరవాసరం ఈఓ వులగం వేణుగోపాలరావు, ఆలయ ఈఓ నామాల రంగరాజన్, ఉపసర్పంచ్ ఆకుల నాగమురళి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సాధనాల లక్ష్మి, ట్రస్టీలు, అర్చకస్వామి, సొసైటీ అధ్యక్షుడు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్(సిద్ధాంతి), ర్యాలి సతీష్, ర్యాలి సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో రవి సోమేశ్వర స్వామి

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలోని శ్రీ ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా రుద్రాభిషేకం అనంతరం పార్వతి అమ్మ వారికి కుంకుమా ర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాసుశర్మ ఆధ్వర్యంలో టీటీడీ వేద పండితులు ఫణీంద్రశర్మ, రామకృష్ణ శర్మ, పవన్ , సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు విశ్వనాథం సోమిరెడ్డి, రేవతిస్వాతి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి


కొత్తపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అచ్చిబాబు

మొగల్తూరు: మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని 10,573 మందికి పింఛన్లు పంపిణీని రెండు రోజుల్లో పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఆర్‌సి ఆనంద్ కుమార్ గురువారం తెలిపారు. కొత్తపాలెంలో లేవలేని పరిస్థితిలో ఉన్న లోకం సత్యవతి అనే వృద్ధురాలికి వేలిముద్రలు సరిపోకపోవడంతో అనేక సార్లు ప్రయత్నించి వెల్ఫేర్ అసిస్టెంట్ అచ్చిబాబు పింఛన్ అందించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం


చించినాడలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రావి మనోహరచారి


సిద్ధాంతంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్

యలమంచిలి: హెల్మెట్ లేని ప్రయాణం నేరమే కాకుండా ప్రాణాప్రాయం కూడానని డీఎస్పీ రావి మనోహరచారి చెప్పారు. మండలంలోని చించినాడ వశిష్ట గోదావరి నది వంతెన దగ్గర ఉన్న పోలీస్ చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం ఆయన వంతెన మీదుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్లపై ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న సమయంలో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్న సమయంలో తలకు బలమైన గాయాలు కావడం వల్ల ఎక్కువ ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు వారు వాడే సెల్ ఫోన్స్‌కు తప్పనిసరిగా గార్డ్ వేస్తున్నారన్నారు. కేవలం రూ.వేలల్లో ఉండే సెల్‌ఫోన్స్‌కు ఇచ్చే ప్రాధాన్యం అమూల్యమైన మన ప్రాణాలకు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. కనుక ప్రతి ఒక్కరూ హెల్మెట్స్ ధరించాలని కోరారు. ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్స్ మాత్రమే వాడాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ ఉన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మార్చి 1 నుంచి మోటార్‌సైకిల్ నడిపే ప్రతీ ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్సై కె.శ్రీనివాస్ కోరారు. దిగమర్రు బైపాస్‌రోడ్డులో గురువారం మోటార్‌సైకిలిస్టులకు ఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. మార్చి 1 నుంచి హెల్మెట్ ధరించకపోతే విధిగా చలానాలు రాస్తామని హెచ్చరించారు.

పెనుగొండలో..

పెనుగొండ: హెల్మెట్ ధారణతో ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని పెనుగొండ ఎస్సై ఎన్‌వీవీ రమేష్ అన్నారు. గురువారం సిద్ధాంతంలో హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ నూతన భవనం ప్రారంభం


శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ నూతన భవన ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య, వైద్య, సామాజిక అవసరాలు తీర్చడం కోసం శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత కొన్నేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రారంభోత్సవ పూజా కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొని ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిమ్మల అనంత రామారావు దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ ప్రశాంతికి ట్రస్ట్ కోశాధికారి నిమ్మల భవాని జ్ఞాపిక అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు-అన్నపూర్ణమ్మ దంపతులు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు గ్రూపుల ఏర్పాటు


ఆక్వా రైతులతో మాట్లాడుతున్న నాక్సా ఫీల్డ్ మేనేజర్ అప్పన భువన

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆక్వా సాగు చేసే రైతులకు గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు నాక్సా ఫీల్డ్ మేనేజర్ అప్పన భువన చెప్పారు. మేడపాడు గ్రామ సచివాలయంలో గురువారం ఆమె ఆక్వా రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎంపెడాలో ఒక భాగమైన నాక్సా ఈ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వివరించారు. పది మంది రైతులు ఒక గ్రూపుగా ఏర్పడాలన్నారు. గ్రూపునకు ఒక పేరు పెట్టుకుని ఆ పేరుతో బ్యాంకు ఖాతా తెరవాలని ఆమె చెప్పారు. సొంత రైతులతో పాటు, చెరువులు లీజుకు తీసుకున్న రైతులు కూడా సభ్యులుగా ఉండవచ్చునని ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, వీఆర్వో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎండు తెగులు కనిపిస్తే చేనును ఆరబెట్టాలి


ఎస్ ఇల్లిందలపర్రులో పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి జయదుర్గామాధురి

పెనుమంట్ర: వరినాట్లు వేసిన చేలల్లో ఎండు తెగులు గుర్తిస్తే, వెంటనే నీరును బయటకు తీసి 3-4 రోజులు చేనును ఆరబెట్టాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎం జయదుర్గామాధురి అన్నారు. గురువారం పెనుమంట్ర మండలంలోని ఎస్ ఇల్లిందలపర్రు గ్రామంలో సత్తి లోకేష్‌రెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె సందర్శించారు. ప్రస్తుతం దాళ్వాపంట 15-30 రోజుల వ్యవధిలో వరిపైరు ఉందని, అక్కడక్కడ దుబ్బులు చనిపోవడం గుర్తించి, రైతులు కంగారుపడుతున్నారని అయితే దీనిపై రైతులు అపోహపడి కంగారు పడుతున్నారని, ముఖ్యంగా ఎంటీయూ 1121 రకంలో అక్కడక్కడ ఈ సమస్య కనబడుతోందని, ఆకు ఎండుతెగులుకు సంబంధించి మొక్క శాఖీయ దశలో వస్తే దీనిని క్రషక్‌ఫేస్ అని అంటారని ఆమె అన్నారు. ఈ తెగులు కనబడిన వెంటనే మూడు రోజులు చేను ఆరబెట్టి ప్లాటోమైసిన్ 50 గ్రాములు కొసైడ్ 250 గ్రాములు మందులను కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. ఈ తెగులు కనిపించిన వెంటనే చేలల్లో నత్రజని వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఈ చేలల్లో ఎకరాకు 15 కిలోల పొటాష్ ఎరువును చల్లుకోవాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఉన్న రైతులను సమావేశపరచి, ఆర్‌బీకే సిబ్బందితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు కొవ్వూరి భాస్కరరెడ్డి, సత్తి వీర్రెడ్డి, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విద్యార్థులకు అభినందన


పోస్టర్‌ను ఆవిష్కరిసున్న కళాశాల యాజమాన్యం, ట్రిపుల్ ఈ విద్యార్థులు

నరసాపురం రూరల్: స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ కాంపిటేషన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అభినందించింది. రంగోళీ, ఆడియో, వీడియో క్లిప్పింగ్స్ తదితర పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ అన్నారు. తమ కళాశాలలో ని విద్యార్థులు చదువుతోపాటు ఇతర అంశాల మీద కూడా పట్టు సాధించే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో విత్ యూత్ 2కే23 పేరుతో ఈ నెల 7,8 తేదీల్లో స్పోర్ట్స్, టెక్నికల్ ఈవెంట్స్, సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేర్ విత్ యూత్ 2కే23 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రెజరర్ కెవి స్వామి, అడ్డాల శ్రీహరి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

నరసాపురం రూరల్: సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం గ్రామంలోని ఉన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్, టేబుల్ ను అందించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ నల్లి జయవరప్రసాద్ (జేవీఆర్), కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


ఎస్‌కేపీ టీవీఆర్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: బాల్యవివాహాలు చేయడం వల్ల బాలికలు చిన్న వయస్సులోనే అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ మౌనిష అన్నారు. ప్రతీ సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ మహిళలు తమ వార్డుల పరిధిలో ఉన్న పాఠశాలల్లో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహనా సదస్సులు ఏర్పాటుచేస్తున్నారు. దానిలో భాగంగా గురువారం స్థానిక బంగారు వారి చెరువు గట్టు ప్రాంతంలో ఉన్న ఎస్‌కేపీ అండ్ టీవీ ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహల నిరోదక చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపరాజు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఈఎండీపీ శిక్షణతో ఎంతో ఉపయోగం



విద్యార్థులు తయారు చేసిన ఓడ నమూనాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెనుమంట్ర: విద్యార్థుల్లో వ్యవస్థాపకత ఆకాంక్ష మరియు అత్యుత్తమ భవిష్యత్‌ను ఎంపికచేసే సామర్థ్యాలను పెంపొందించడానికి పాఠశాలల్లో ఈఎండీపీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని మహాత్మా జ్యోతిబాపులే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ వాణి అన్నారు. గురువారం పెనుమంట్ర మండలం నెగ్గిపూడి గురుకుల పాఠశాలలో ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్షణా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఎస్.హర్షవర్ధన్, బి.చరణ్, కె దొరబాబు, ఎం.హరినాధరెడ్డి అనే విద్యార్థులు పనికిరాని అట్టలతో తయారు చేసిన ఓడను ఈ శిక్షణలో ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఔత్సాహిక మనస్తత్వం నైపుణ్యాలను ప్రదర్శించడం, ప్రాజెక్టు ద్వారా వారి ప్రతిభను, మరియు అభ్యాసాలను రూపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఓడ నమూనాను తయారుచేసి అందులో లైటింగ్‌కూడా అమర్చిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం.వెంకటరమణ, ఏటీపీ కె.చినబాబు, పి.వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.